నాణ్యతతో పనులను పూర్తి చేయాలి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ పద్మావతిపాపయ్య యాదవ్‌

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 7వ డివిజన్‌లోని నర్సారెడ్డి కాలనీ, రాధానగర్‌ ఫేస్‌–2లో 30 లక్షల నిధులతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్‌ కార్పొరేటర్‌ పద్మావతి పాపయ్య యాదవ్‌ పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి అయ్యేలా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సంస్థకు మనమే రక్షకులం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్‌ డివిజన్‌ విద్యుత్‌ కార్యాలయంలో గురువారం విద్యుత్‌ డీఈ రత్నాకర్‌ రావు అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌ ఎస్‌ఈ రామ్మోహన్‌ మాట్లాడుతూ.. విద్యుత్‌ యాజమాన్యం రెవెన్యూ పట్ల దృష్టి సారించాలని, విద్యుత్‌ సంస్థకు మనమే రక్షకులుగా ఉండి రావలసిన బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. విద్యుత్‌ వినియోగదారులు ట్విట్టర్‌ ద్వారా వచ్చే ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సర్కిల్‌ ఎస్‌ ఏఓ వీరస్వామి, అకౌంట్స్‌ అధికారులు (రెవెన్యూ)హరీష్‌ చంద్రశేఖర్‌, డీఈ రత్నాకర్‌, అసిస్టెంట్‌ అకౌంట్స్‌ ఆఫీసర్లు, డివిజన్‌ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందితో డీసీ సమావేశం


రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన డీసీ రవి కుమార్‌

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో గురువారం ఉప కమిషనర్‌ రవి కుమార్‌ రెవెన్యూ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్లకు ఆయన పలు సూచనలు, సలహాలను అందించారు. ఆస్తిపన్నుతో పాటు వాణిజ్య సముదాయాల నుంచి పన్నులు వసూలు చేయాలని సూచించారు.

వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరణ



మణికొండ: సెప్టెంబర్‌ 23న జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర సెమినార్‌ను విజయవంతం చేసేందుకు కార్మికులంతా సంఘటితం కావాలని మాజీ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్‌ కమిషన్‌ సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. గండిపేట మండల పరిధిలోని మణికొండలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లేష్‌ ఆధ్వర్యంలో వాల్‌ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు నెలవారీగా 12 వేలు ఇవ్వాలని, 10 లక్షల ఇన్సూరెన్స్‌ ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల హెల్పర్‌ బోర్డు స్కీమ్‌లను ప్రైవేట్‌ ఇన్సూరెన్స్‌ కంపెనీలకు అప్ప చెప్పటం సరికాదన్నారు. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలవారీగా 5వేల రూపాయలు ఫించన్‌ చెల్లించాలని, అర్హులైన వారికి డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లు అందించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి నాయకులు బాబురావు, మండల కార్యదర్శి స్వామి, సత్యం, లక్ష్మి, ఏఐటీయూసి నాయకులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి గ్యాస్‌ పత్రాల పంపిణీ



మణికొండ: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకే గ్యాస్‌ సిలిండర్‌ పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేస్తుందని నార్సింగి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌ డీలర్‌ షాప్‌ వద్ద 243 మందికి మంజూరైన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పేదలకు మరిన్ని పథకాలను అమలు చేసే దిశగా కాంగ్రెస్‌ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌ అమరేందర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ కృష్ణ, మాజీ సర్పంచ్‌ నరసింహా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన డ్యూక్స్‌ ఎలైట్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అత్తాపూర్‌ విజయ్‌ ఆనంద్‌ గ్రౌండ్‌ వేదికగా నిర్వహించిన డ్యూక్స్‌ ఎలైట్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో భాగంగా రవి ఫుడ్స్‌ ఆధ్వర్యంలోని యూనిట్‌ 1, యూనిట్‌ 2 మధ్య మొదటి మ్యాచ్‌లో యూనిట్‌ 1 విజయం సాధించింది. 2వ మ్యాచ్‌లో యూనిట్‌2, యూనిట్‌ 3 పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్స్‌లో యూనిట్‌ 1 జట్టు యూనిట్‌2 పై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ రవీందర్‌ అగర్వాల్‌ విజేత జట్టుకు ట్రోఫీని అందించడమే కాకుండా టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతీ క్రీడాకారునికి ప్రశంసా పత్రాలను అందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని కొత్వాల్‌గూడలోని హిమాయత్‌సాగర్‌ చెరువు ఒడ్డున నీళ్లలో మృతదేహం (40) తేలియాడుతుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు టీషర్టు ఉన్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరకొర అభివృద్ధి పనులతో తీవ్ర అవస్థలు

స్నేహితహిల్స్‌లో రూ.30 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులు

- రోడ్డుపైనే ప్రవహిస్తున్న డ్రైనేజీ మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తప్పని ఇక్కట్లు
- త్వరలో పూర్తి చెయ్యాలంటున్న స్థానికులు


రోడ్డుపై పారుతున్న మురుగునీరు

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్‌ పరిధి స్నేహితహిల్స్‌ కాలనీలో రూ. 30 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు అరకొరగా కొనసాగుతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని డ్రైనేజీ నిర్మాణ పనులు..

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి కొన్ని రోజులు గడుస్తున్నప్పటికీ పనులు మాత్రం పూర్తి చేయలేకపోతున్నారు. కొంతమేర పనులు చేసి రోడ్డుపైనే ఘన వ్యర్థాలను వదిలేయడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


రోడ్డుపై మురుగునీరు, వ్యర్థాలు

రోడ్డుపైనే మురుగు.. దుర్వాసన ఇబ్బందులు

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయకుండా రోడ్డు మధ్యలో వదులుతుండటంతో మ్యాన్‌ హోల్‌ నుంచి మురుగునీటితో పాటు వ్యర్థాలు కూడా రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంజనీరింగ్‌ అధికారుల పర్యవేక్షణ ఏది?

నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత ఇంజనీరింగ్‌ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో కాంట్రాక్టర్‌ ఇష్టానుసరంగా నాణ్యతా లోపంతో పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపైనే మురుగు వదిలేయడం అధికారులకు కనిపించడంలేదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత ఇంజనీరింగ్‌ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు, వ్యర్థాలు రోడ్డుపైకి రాకుండా డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని కార్పొరేషన్‌ ఇంజనీరింగ్‌ అధికారులతో సాక్షి మాట్లాడేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


మ్యాన్‌హోల్‌ నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా


నాలా పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ సంగీత గౌరీశంకర్‌

అత్తాపూర్‌: హైదర్‌గూడ ఫ్లేజ్‌ సెకండ్‌ పార్క్‌ కాలనీలో నాలా పైకప్పు పనులు కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్‌ సంగీత గౌరీశంకర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని ఏళ్లక్రితం ఎప్పుడో నిర్మించిన నాలా పైకప్పు శిథిలావస్థకు చేరడంతో కుంగిపోయిందన్నారు. ఈ నాలా ఉప్పరపల్లి చైతన్య విలాస్‌ గుండా హైదర్‌గూడ పలు బస్తీలలో నుంచి పెద్ద ఎత్తున ప్రవహిస్తుందని, దీంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి రూ.7 లక్షలా 50వేల వ్యయంతో పనులు ప్రారంభించడం జరిగిందని, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. అభివృద్ధి పనులు చేపడుతున్నందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నరసింహమూర్తి, కాలనీ అధ్యక్షులు రాజేశ్వరరావు, సుధాకర్‌, సిద్దేశ్వర్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

మిలాద్‌–ఉన్‌–నబీ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న యువకులు, చిన్నారులు

రాజేంద్రనగర్‌: మిలాద్‌–ఉన్‌–నబీ సందర్భంగా రాజేంద్రనగర్‌లో ముస్లిం సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఆర్‌కె యూత్‌ ఆధ్వర్యంలో నవజ్యోతి యూత్‌ క్లబ్‌ ప్రాంతాల్లోని ప్రార్థన మందిరం నుంచి రాజేంద్రనగర్‌ ఎస్‌ఐఆర్‌డీ చౌరస్తా, యూనివర్సిటీ రోడ్డు, పీడీపీ చౌరస్తా, చింతల్‌మేట్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చిన్నారులు, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డివిజన్‌ మజ్లీస్‌ పార్టీ అధ్యక్షులు షేక్‌ రియాజ్‌, పార్టీ సీనియర్‌ నాయకుడు ముర్తుజా అలీ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లీం సోదరులు

అత్తాపూర్‌: నియోజకవర్గంలోని సులేమాన్‌ నగర్‌లో ముస్లీం సోదరులు ఈద్‌ మిలాద్‌–ఉన్‌–నబి పర్వదినం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌ డీసీపీ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో మతసామరస్యాలకు ప్రతీకగా పండుగలను జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం సోదరులు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల హౌస్‌ అరెస్టు


హౌస్‌ అరెస్టులో బీఆర్‌ఎస్‌ నాయకులు నాగరాజు తదితరులు


నాయకులను హౌజ్‌ అరెస్ట్‌ చేస్తున్న పోలీసులు

బండ్లగూడ: ప్రజాభవన్‌ ముట్టడికి బీఆర్‌ఎస్‌ పార్టీ గురువారం పిలుపు నేపథ్యంలో మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి బీఆర్‌ఎస్‌ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్పొరేషన్‌ అధ్యక్షుడు రావుకోల్ల నాగరాజు ఖండించారు. నార్సింగి పోలీసులు ముందస్తుగా కార్పొరేషన్‌ బీఆర్‌ఎస్‌ నాయకులను హౌస్‌ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం రుణమాఫీపై రైతులకు ఇచ్చిన మాట తప్పిందని, ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని లేదంటే రైతు ఉద్యమం మొదలైవుతుందని హెచ్చరించారు.

రాజేంద్రనగర్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షులు ధర్మారెడ్డి పార్టీ కార్యకర్తలతో ప్రజాభవనాన్ని ముట్టడించేందుకు బయలుదేరుతుండగా పోలీసులు గురువారం హౌజ్‌ అరెస్ట్‌ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావలిగూడెం గిరిబాబు, అల్లి శేఖర్‌, శివ గౌడ్‌, సందీప్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో పురుగు మందుల వాడకం తగ్గాలి



వీసీకి జ్ఞాపికను అందిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో భారత వ్యవసాయంలో పురుగు మందులు, జీవ రసాయనాల వాడకం పై ప్లాంట్‌ ప్రొటెక్షన్‌ ఆఫ్‌ఇండియా ఆధ్వర్యంలో మేధో మధనం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్‌ శారదా జయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ పంటల్లో పురుగుమందుల వాడకం అవసరానికి మించి వాడుతున్నారని, దీనిని తగ్గించకపోతే చాలా విధాలుగా నష్టపోవల్సి ఉంటుందన్నారు. రైతులు ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం జరిగి పర్యావరణ పరిరక్షణకు భారి ముప్పు వాటిల్లుతుందని అన్నారు. శాస్త్రవేత్తలు అందరూ జీవ సంబంధిత మందులపై పరిశోధనలు చేసి రైతులకు అందించాలని కోరారు. రిజిస్ట్రార్‌ రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులకు డ్రోన్స్‌తో పురుగు మందుల పిచికారీ సస్య రక్షణ పద్ధతుల పై అవగాహన కలిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ టీవీకే సింక్‌, డాక్టర్‌ జగదీశ్వర్‌, డాక్టర్‌ శ్రీనివాస్‌రావు, కళ్యాణ గోస్వామి, త్యాగరాజన్‌ వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నియమాలను తెలుసుకోవాలి


విద్యార్థులకు ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

మణికొండ: విద్యార్థులకు చిన్ననాటి నుంచే ట్రాఫిక్‌ నియమాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని సైబరాబాద్‌ పోలీస్‌ ట్రాఫిక్‌ ట్రెనింగ్‌ ఇన్స్టిట్యూట్‌ అధికారులు రాఘవేందర్‌, నవీన్‌చారి, మల్లేశ్వరరావు, మల్లేశ్వర్‌, మస్తాన్‌లు వెల్లడించారు. సోసైటీ ఫర్‌ సైబర్‌ సెక్యూరిటీ కౌన్సిల్‌ సభ్యులు నీతా వడ్డేరే, వీర సాకేత్‌, అందె లక్ష్మణ్‌రావు, దిలీప్‌ కక్కడ్‌ వారి తోడ్పాటుతో నార్సింగి గవర్నమెంట్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌ కుమార్‌ సహకారంతో స్కూల్‌ విద్యార్థులకు ట్రాఫిక్‌ నిబంధనల గురించి వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌ నిబంధనలను అనుసరించి వాటిని తూచాతప్పకుండా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్‌ కార్మికురాలు మృతి

బండ్లగూడ: మున్సిపల్‌ కార్మికురాలు బైరాగిగూడ నివాసి పూడూరు లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. తెలంగాణ మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయిస్‌ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యాదగిరి, గండిపేట మండల కన్వీనర్‌ డప్పు ప్రవీణ్‌కుమార్‌ ఆమె భౌతికాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల్లో మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రూ. 10 లక్షల ఇన్సూరెన్స్‌ 26 వేల ఫిక్స్‌డ్‌ వేతనం కార్మికులను పర్మినెంట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. తోటి కార్మికుల కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 4 వేలు సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, సురేష్‌, జగన్‌, సుభాష్‌ తోటి కార్మికులు పాల్గొనడం జరిగిందన్నారు.

డాక్టరేట్‌ ప్రదానం



మణికొండ: సీబీఐటీలో సహాయ ఆచార్యుడిగా పని చేస్తున్న వసంత్‌ సేనకు జేఎన్‌టీయూ హైదరాబాద్‌ కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌, డేటా సైన్స్‌ విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న వసంత్‌సేనకు డాక్టరేట్‌ లభించింది. ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని జవహర్‌ లాల్‌ నెహ్రూ టెక్నాలజికల్‌ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. వసంత్‌సేన జేఎన్‌టీయూ హైదరాబాద్‌ ప్రొఫెసర్‌, పరీక్షల అదనపు కంట్రోలర్‌ సమ్మూలాల్‌ మార్గదర్శకత్వంలో పరిశోధన చేశారు. తన పరిశోధనలో స్మార్ట్‌ వాటర్‌ గ్రిడ్‌లో డీప్‌ లెర్నింగ్‌ ఫ్రేమ్‌వర్క్‌ను ఉపయోగించి అధునాతన అల్గారిథమ్‌లను కూడా అభివృద్ధి చేశారు. వసంత్‌ సేన తన అకాడామిక్‌ సాధనలను కొనసాగిస్తూనే పీహెచ్‌డీని విజయవంతంగా పూర్తి చేయడం పట్ల జేఎన్‌టీయూ సిబ్బంది, సీబీఐటీ ఏఐ, డిఎస్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ రాధిక, ప్రిన్సిపల్‌ ప్రొఫెసర్‌ నర్సింహులు, సహచరులు అభినందించారు.

మాంగళ్య షాపింగ్‌ మాల్‌లో పనిచేయుటకు
స్టాఫ్‌ కావలెను
• ఫ్లోర్‌ మేనేజర్స్‌ • సూపర్‌వైజర్స్‌
• సేల్స్‌మెన్‌ • ఎలక్ట్రీషియన్స్‌ • సేల్స్‌గర్ల్స్‌
• హెల్పర్స్‌ • టైలర్స్‌ • ఆఫీస్‌బాయ్స్‌
ఇంటర్వ్యూ తేది : 20 సెప్టెంబర్‌, 2024
సమయం : ఉదయం గం॥ 11.00 ల నుండి సా॥ గం॥ 5.00ల వరకు
అభ్యర్థులకు గమనిక : బ్యాంక్‌ అకౌంట్‌, ఆధార్‌కార్డ్‌ (జిరాక్స్‌) తో పాటు 2 పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలు వెంట తెచ్చుకోగలరు.
మాంగళ్య షాపింగ్‌ మాల్‌
మెయిన్‌రోడ్‌, HP పెట్రోల్‌ బంక్‌ ప్రక్కన, నార్సింగి.
91107 48801 / 73298 22297
మర్రిచెట్టు చౌరస్తా, మణికొండ
93901 08909 / 96522 29972

శారదాధామంలో సైన్స్‌ ఫెయిర్‌


కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యా ప్రాంతీయ సంచాలకులు విజయలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం,


హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని శ్రీ శారదాధామం ప్రాంగణంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం శ్రీ సరస్వతీ విద్యాపీఠం భాగ్యనగర్‌ విభాగ్‌ సైన్స్‌ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర విద్యా ప్రాంతీయ సంచాలకులు విజయలక్ష్మి హాజరై జ్యోతిప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడు విజ్ఞానవంతులుగా ఎదుగుతారని, విషయ పరిజ్ఞానం కోసం అనేక పుస్తకాలను అధ్యాయనం చేయాలన్నారు. ఆవాస విద్యాలయం అధ్యక్షులు గోకరి అర్జున్‌గౌడ్‌, కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్‌, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గున్నాల దశరథ్‌రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించిన హోంగార్డు


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ట్రాఫిక్‌ హోంగార్డు రవి

రాజేంద్రనగర్‌: ఊరికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో బస్సు నుంచి కిందికి దిగిన కుమారుడిని రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ హోంగార్డు చేరదీసి తల్లికి అప్పగించాడు. నిజాంపేట్‌ ప్రాంతానికి చెందిన శోభమ్మ తన కుమారుడు చిన్న (7)ను తీసుకొని మహబూబ్‌నగర్‌కు బస్సులో గురువారం ప్రయాణమైంది. ఆరాంఘర్‌ చౌరస్తా బస్టాపు వద్దకు రాగానే కుమారుడు చిన్న బస్సు దిగాడు. ఈ విషయం గమనించని తల్లి కొద్ది దూరం వెళ్లిన తర్వాత చూసుకొని చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికింది. ఫలితం లేకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. బాలుడు చిన్న ఏడుస్తూ ఆరాంఘర్‌ చౌరస్తా ప్రాంతంలో ఉండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రవి బాలుడిని చేరదీశాడు. బాలుడి వివరాలు తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఈ నేపథ్యంలో స్టేషన్‌లోనే ఉన్న శోభమ్మను తీసుకుని పోలీసులు ఆరాంఘర్‌ చౌరస్తా వద్దకు రాగా, హోంగార్డు రవి బాలుడిని అప్పగించాడు. ఈ సందర్భంగా స్థానికులు హోంగార్డు రవిని అభినందించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230